సాక్షి ప్రకాశం

సోమవారం । 27 । జనవరి । 2025



ప్రతిభకు పురస్కారం

జిల్లాలో వివిధ రంగాల్లో విధి నిర్వహణలో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్, ఎస్పీ ప్రతిభా పురస్కారాలు అందజేశారు.

- 8లో..



రాజ్యాంగ స్ఫూర్తితో జిల్లా అభివృద్ధి

రాజ్యాంగ స్ఫూర్తితో జిల్లాను అభివృద్ధి చేయాలని జేసీ గోపాలకృష్ణ అన్నారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31/20

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు

ఒంగోలు సిటీ: ఒంగోలు మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటివ్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం ఒంగోలులోని ఎల్బీజీ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా సీమాంధ్ర డ్రగ్ ట్రేడర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కోశాధికారి సతీష్, సిమ్స్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ ఏ.శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చీకటి శ్రీనివాస్ హాజరై పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో 2025 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సీహెచ్ చిరంజీవి, కార్యదర్శిగా ఐకే కృష్ణమోహన్, ఉపాధ్యక్షునిగా ఎస్కే జిలాని బాష, కాలం వెంకటరావు, సహ కార్యదర్శులుగా ఉదయ్ కిరణ్, గురువారావు, కోశాధికారిగా ఆంజనేయులు తో పది మంది వర్కింగ్ కమిటీ మెంబర్స్ ఎన్నుకున్నట్లు తెలిపారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చటంలో విఫలం

● సంయుక్త కిసాన్ మోర్చా నిరసన ర్యాలీలో వక్తలు



ట్రాక్టరు, బైక్, ర్యాలీలో నిరసన తెలుపుతున్న రైతు నాయకులు

ఒంగోలు సిటీ: రైతాంగానికి లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీపీ ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆల్ ఇండియా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకాశం జిల్లా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ట్రాక్టర్, బైక్, ఆటోల నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఒంగోలు మినీ స్టేడియం నుంచి నెల్లూరు బస్టాండ్ మీదుగా కలెక్టరేట్, చర్చి సెంటర్ మిరియాలపాలెం సెంటర్, ట్రంకు రోడ్డు మీదుగా అద్దంకి బస్టాండ్ వరకు కొనసాగింది. కార్యక్రమానికి సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో బ్రిటీష్ వారికి, బీజేపీ వారికి కేవలం పాలనలో తప్ప దోపిడీలో ఎటువంటి వ్యత్యాసం లేదన్నారు. బ్రిటీష్ వారు తమ పాలనను కొనసాగించేందుకు ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించి, ప్రజలను విభజించి పాలించిన తీరుగా ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య కులాలు, మతాల విద్వేషాలు రేకెత్తిస్తూ తమ పబ్బం గడుపుకోవాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 60 శాతం పైన ప్రజలు వ్యవసాయ రంగం పై ఆధారపడి ఉన్నారనీ, అటువంటి ప్రజల సమస్యల కన్నా కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి కార్పొరేట్‌లకు దేశ సంపదను దోచిపెట్టడమే ధ్యేయంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పమిడి వెంకటరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎస్.లలిత కుమారి, కొత్తకోట వెంకటేశ్వర్లు, కోడూరి నాంచార్లు, జార్జ్, కె.వీరారెడ్డి, సర్దార్, సలార్, శ్రీరామ్ శ్రీనివాసులు, పద్మ, చొప్పర జాలన్న, చొప్పర సాగర్, పరిటాల కోటేశ్వరరావు, కంకణాల రమాదేవి, బాలకోటయ్య, జుజ్జురి జయంతిబాబు, పెంట్యాల హనుమంతరావు, చెరుకూరి వాసు, బీమవరపు సుబ్బారావు, పిన్నిక శ్రీను, దాసరి సుందరం, వేజెండ్ల శివరాం, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మేయర్ గంగాడ



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన ఎస్పీ దామోదర్



పోలీసుల కవాతును వీక్షిస్తున్న జిల్లా అధికారులు

ఘనతంత్ర సంబరం

● ఆసక్తికరంగా డ్రోన్ పరేడ్, స్క్వాడ్ టీం సాహసాలు ● డాగ్ స్క్వాడ్ విన్యాసాలు అదుర్స్ ● ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, దేశభక్తి గీతాలతో సాంస్కృతిక కార్యక్రమాలు ● ఘనంగా 76వ గణతంత్ర దిన వేడుకలు ● పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా ● అలరించిన ప్రభుత్వ శాఖల ప్రదర్శన ● జిల్లాలో ఉత్తమ సేవలందించిన 515 మందికి ప్రశంస పత్రాలు అందజేత

ఒంగోలు సబర్బన్:

గణతంత్ర దిన వేడుకలు స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకొని జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. ముందుగానే పరేడ్ గ్రౌండ్‌ను జిల్లా రెవెన్యూ యంత్రాంగంతో కలిసి సిద్ధంచేసిన పోలీసులు వివిధ రకాల సాహసాలు, విన్యాసాలతో ప్రజలను ఆకట్టుకున్నారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జాతీయ గీతాలాపన తరువాత కలెక్టర్ ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంలో బయలుదేరి పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో కలిసి పరేడ్ కమాండర్ ఏఆర్ డీఎస్పీ ఏ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గౌరవ వందనాన్ని స్వీకరించారు. జిల్లా అభివృద్ధిపై వేదికపై నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా వివరించారు.

76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎనలేని త్యాగాలు స్వాతంత్ర్య సమర యోధులకు, భారత రాజ్యాంగం రూపొందించిన రాజ్యాంగ నిర్మాతలను గుర్తుచేసుకున్నారు. పేదరిక నిర్మూలన, మౌలిక సౌకర్యాల అభివృద్ధి, వనరుల సమర్థ నిర్వహణ, ఈజ్ ఆఫ్ లివింగ్ మొదలైన పది సూత్రాలను దృష్టిలో పెట్టుకొని రాబోయే ఐదు సంవత్సరాల్లో 15 శాతం కంటే ఎక్కువ వృద్ధి రేటుతో జిల్లాలో సమ్మిళిత అభివృద్ధి సాధన లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించారన్నారు. జిల్లాలో ఎనిమిది సంవత్సరాల లోపు పిల్లలకు పౌష్టికాహారాన్ని, సరైన విద్యను అందించి వాళ్ల భద్రతకు భరోసా కల్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్న సంకల్పంతో బంగారు బాల్యం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణాలను, గ్రామాలను వ్యర్థ రహిత, పరిశుభ్ర పట్టణాలుగా, గ్రామాలుగా మార్చేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ అన్నారు. సమస్యలపై ప్రజల నుంచి అందిన వినతులను సత్వరమే పరిష్కరించేలా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు నిర్వహిస్తారన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూమి సంబంధిత ఫిర్యాదులను పరిష్కరించేందుకు పూనుకున్నామని వెల్లడించారు. భూముల రీ సర్వే చేపట్టి రికార్డుల్లో ఉన్న లోపాలను సరిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల్లో నిరంతరం సమీక్షలు నిర్వహించి రైతులకు, పాడి రైతులకు ప్రయోజనం చేకూరేలా అడుగులు ముందుకు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ ఏఆర్.దామోదర్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాల కృష్ణ, ఏఎస్పీ కే.నాగేశ్వర రావు, డీఆర్ఓ ఓబులేసు, ఒంగోలు ఆర్డీఓ ప్రసన్న లక్ష్మీ, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాస రావుతో పాల్గొన్నారు.



భరతమాత వేషధారణలో విద్యార్థిని

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు..

చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మొత్తం ఆరు పాఠశాలల నుంచి విద్యార్థినీ, విద్యార్థులు తమ ప్రదర్శనలు నిర్వహించారు. వాటిలో మొదటి బహుమతిని డ్రీమ్స్ హైస్కూలు విద్యార్థులు కై వసం చేసుకున్నారు. 'జయహో...జయహో భరత మాతా' అన్న గీతానికి చిన్నారులు చేసిన నృత్యానికి ఈ గౌరవం దక్కింది. సింగరాయకొండకు చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రదర్శించిన 'జగతి సిగలో జాబిలమ్మకు వందనం' అన్న పాటకు వేసిన ప్రదర్శనకు రెండో బహుమతి లభించింది. మూడో బహుమతి 'చల్తేహై...చల్తేహై' అన్న గేయానికి వేసిన నృత్యానికి ఎపెక్స్ హైస్కూలు విద్యార్థినీ, విద్యార్థులకు వచ్చింది. సెయింట్ జాన్స్ స్కూలు విద్యార్థులు వందే మాతరం గేయంలో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో ప్రదర్శించారు. అన్నవరప్పాడుకు చెందిన సూర్య హైస్కూలు విద్యార్థులు 'పుణ్యభూమి నాదేశం నమోనమామీ...' అన్న పాటకు నృత్యం చేశారు. గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూలు విద్యార్థులు 'జై జవాన్' పాటతో పాటు 'మే మే ఇండియన్స్' పాటను ప్రదర్శించారు.



దేశభక్తి గీతానికి నృత్యం చేస్తున్న సెయింట్ జేవియర్స్ విద్యార్థులు



నృత్యం చేస్తున్న డ్రీమ్స్ స్కూల్ విద్యార్థులు

అదరగొట్టిన డాగ్ స్క్వాడ్ విన్యాసాలు...

పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోలీస్ డాగ్ స్క్వాడ్ విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పోలీస్ జాగిలాలు డాగ్ హ్యాండ్లర్స్ సూచనల మేరకు అద్భుతంగా విన్యాసాలు చేశాయి. పోలీస్ ఉన్నతాధికారులకు సెల్యూట్ మొదలుకొని అన్నీ విన్యాసాలు చేశాయి. డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్, హెడ్ కానిస్టేబుల్ వరప్రసాదరావు జాగిలాలను సాహసాలు చేసేలా వాటిని గైడ్ చేశారు. ప్రదర్శనలో పోలీస్ జాగిలాలు జాకీ, స్వీటీ, మాగీ, చీటాలు పాల్గొన్నాయి. జాకీ జాగిలం హర్డిల్స్ చేస్తూ, మంటల్లో కూడా రింగులో నుంచి దూకుతూ ఆశ్చర్యకరమైన ప్రదర్శనను చేసింది.



మండుతున్న సర్కిల్ నుంచి దూకుతున్న పోలీసు జాగిలం

రోమాలు నిక్కబొడిచేలా స్వాట్ టీమ్ సాహసాలు...

జిల్లాలో ప్రత్యేకంగా రూపొందించిన స్వాట్ టీమ్ సాహసాలు చూపరుల రోమాలు నిక్కబొడిచేలా ప్రదర్శించారు. నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ తరహాలో చేపట్టిన ఈ సాహసం వాస్తవ సరిస్థితిని తలపించింది. వీఐపీని అపహరించిన తీవ్రవాదుల నుంచి అతనిని కాపాడటంలో వాళ్లు చూపించిన తెగువ అందరినీ కళ్లప్పగించేలా చేసింది. తీవ్రవాదులకు, స్వాట్ టీమ్‌కు మధ్య జరిగిన పోరాటం కళ్లకు కట్టినట్లు చూపించారు. తుపాకుల కాల్పుల నడుమ, బాంబులు పేలుళ్ల మధ్యలో చేసి చూపెట్టిన ఈ సాహసం అందరినీ కట్టి పడేసింది. ఆ కాసేపు బాంబుల పేలుళ్లు, తుపాకుల తూటాల శబ్దాలతో గ్రౌండ్ మార్మోగింది.



ఉగ్రవాదులను మట్టుబెడుతున్నట్లు స్వాట్ టీమ్ ప్రదర్శన

ఆసక్తిగా డ్రోన్ పరేడ్...

గణతంత్ర వేడుకల్లో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన డ్రోన్‌ల పరేడ్ అందరినీ ఆకట్టుకుంది. ప్రకాశం పోలీస్ అన్న బ్యానర్లతో ఆకాశంలో డ్రోన్లు కనువిందు చేశాయి. ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో పీసీఆర్ ఎస్సై ప్రభాకర రెడ్డి నేతృత్వంలో డ్రోన్ల ఆపరేటర్లకు వాకీటాకీ, సెల్‌ఫోన్ కాన్ఫరెన్స్ ద్వారా డైరెక్షన్స్ ఇస్తూ సమర్థవంతంగా డ్రోన్ల పరేడ్‌ను కనులవిందుగా నిర్వహించారు. పలు డ్రోన్లు ఈ పరేడ్‌లో పాల్గొన్నాయి.



డ్రోన్స్ ప్రదర్శన

మొదటి బహుమతి దక్కించుకున్న గనుల శాఖ స్టాల్...

వేడుకల్లో భాగంగా జిల్లా గనులు, భూగర్భ వనరుల శాఖ స్టాల్ మొదటి బహుమతి దక్కించుకుంది. రెండో స్థానంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖకు లభించింది. మూడో స్థానంలో రైతు సేవా కేంద్రాలు-జిల్లా వనరుల కేంద్రం నిలిచింది. వీటితో పాటు పట్టణ పేదరిక నిర్మూలన శాఖ-మెప్మా, డీఆర్‌డీఏ, విద్యాశాఖ- సమగ్ర శిక్ష, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛ సంకల్పం-స్వచ్ఛ ప్రకాశం, రహదారులు-భవనాల శాఖ, ఆయుష్ శాఖ, అటవీ శాఖ, జలవనరుల శాఖ, పశు సంవర్ధక శాఖలు కూడా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఒంగోలు నగర పాలక సంస్థ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు చూడటానికి వచ్చిన ప్రజలకు మంచినీటిని అందించారు.



స్టాల్స్‌ను సందర్శిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

వ్యవసాయ అనుబంధ శాఖల శకటానికి ప్రథమ స్థానం

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రదర్శించిన వ్యవసాయ అనుబంధ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన శకటానికి ప్రథమ బహుమతి దక్కింది. వ్యవసాయ అనుబంధ శాఖల శకటంతో పాటు ఒంగోలు నగర పాలక సంస్థకు చెందిన శకటానికి కూడా మొదటి బహుమతిని అందజేశారు. అదేవిధంగా విద్యుత్ శాఖ, నీటి యాజమాన్య సంస్థలు ప్రదర్శించిన రెండు శకటాలకు రెండో బహుమతి ఇచ్చారు. ఇక మూడో బహుమతిని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-వెలుగు, సెర్ప్ శకటంతో పాటు విద్యుత్ శాఖకు చెందిన శకటానికి కలిపి దక్కించుకున్నాయి. వీటితో పాటు పౌర సరఫరాల శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, జిల్లా పరిశ్రమల శాఖ, విద్యాశాఖ-సమగ్ర శిక్ష విభాగం, వైద్యారోగ్య శాఖ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలు కూడా శకటాలను ప్రదర్శించాయి.



మంటలు ఆర్పుతూ అగ్నిమాపక దళం ప్రదర్శన

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన....

పరేడ్ గ్రౌండ్‌లో ప్రత్యేకంగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు జిల్లా విపత్తు స్పందన అండ్ అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది ఏవిధంగా నివారిస్తారు, ప్రజలను ఏ విధంగా కాపాడుతారు అన్న అన్ని అంశాలను ప్రదర్శన ద్వారా చూపించారు. మంటలు చెలరేగినప్పుడు ముందస్తుగా ఎలాంటి చర్యలు చేపట్టాలి, ప్రాణాపాయం లేకుండా ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి అన్ని అంశాలను కళ్లకు కట్టినట్లు చూపించారు. ఇళ్లలో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వచ్చేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, మంటలను అదుపు చేయటానికి తీసుకోవాల్సిన మెళకువల గురించి ప్రదర్శించారు. వాటర్, ఫోమ్ ద్వారా మంటలు ఏవిధంగా ఆపాలి అన్న అంశాలను కూడా ప్రదర్శించారు. ప్రమాదాల్లో గాయపడిన వారిని అంబులెన్స్ ద్వారా తరలించే విధానాన్ని కూడా కళ్లకు కట్టినట్లు చూపించారు.



జెండా వందనం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: దేశం కోసం సేవలందించిన స్వాతంత్ర్యోద్యమ నాయకుల అడుగు జాడల్లో నడవాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. ఒంగోలులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో 76వ గణతంత్ర దిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి, జెండా వందనం చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం రోజున స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగాన్ని ప్రసాదించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయులను స్మరించుకుందామన్నారు. ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మాట్లాడుతూ ఎంతో మంది అమరుల త్యాగాల ఫలమే ఈరోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ అని కొనియాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో, సేవాభావంతో పనిచేయాలన్నారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు సమాన భాగస్వామ్యం దక్కేలా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కలలుగన్న సమ సమాజ సాధనకు పాలకులు మరింత కృషి చేయాల్సి ఉందన్నారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవరపల్లి రమణయ్య.. బూచేపల్లి వెంకాయమ్మ, చుండూరు రవిబాబు ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర రావు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యులు శ్యాంసాగర్, వి.వెంకటేశ్వర్‌రెడ్డి, నాగూర్, నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందుకుంటున్న (కుడి నుంచి ఎడమకు) ఆర్.గోపాలకృష్ణ (జాయింట్ కలెక్టర్), బీసీహెచ్ ఓబులేసు (డీఆర్ఓ), బి.చిరంజీవి (జెడ్పీ సీఈఓ), టి.రవికుమార్ (డీఆర్డీఏ పీడీ), జె.జోసఫ్‌కుమార్ (డ్వామా పీడీ), డి.వెంకటేశ్వర్లు (సీపీఓ), పి.శ్రీనివాసప్రసాద్ (హౌసింగ్ పీడీ), ఎస్.శ్రీనివాసరావు (డీఏఓ), పి.విద్యాసాగర్ (గ్రౌండ్ వాటర్ డిడి), ఎన్.లక్ష్మానాయక్ (సోషల్ వెల్ఫేర్ అధికారి), పి.భాస్కర్‌బాబు (ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ), ఎ.గాయత్రీదేవి (లేబర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్), వైఎంఎస్‌వీఎస్ గోపీచంద్ (డీహెచ్ఓ), పీవీ రమణ (ఏపీఎంఐపీ పీడీ), టి.రాజశేఖర్ (జిల్లా గనులశాఖ అధికారి), టి.భరద్వాజ్ (జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి), జె.రవితేజయాదవ్ (స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్), కె.వెంకటేశ్వరరావు (ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్), కె.లక్ష్మీప్రసన్న (ఒంగోలు ఆర్డీఓ), సీహెచ్ శ్రీనివాసరావు (కలెక్టరేట్ అడ్మిన్ సూపరింటెండెంట్), బి.రవి (పశుక్షేత్రం డీడీ), ఎస్.వెంకటసుబ్బయ్య (నిక్, డీఐఓ), ఆర్.సుశీల (రవాణాశాఖ కమిషనర్), ఎం.వెంకటేశ్వరరావు (బీసీ సంక్షేమశాఖ అధికారి), కె.చిరంజీవి (తహసీల్దార్), డి.దుర్గాప్రసాద్‌రావు (డివిజనల్ పీఆర్ఓ)



కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందుకుంటున్న (ఎడమ నుంచి కుడికి) వై.రామారావు (దర్శి సీఐ), సీహెచ్ ప్రభాకర్‌రావు (వై.పాలెం సీఐ), పి.దేవప్రభాకర్ (డీసీఆర్‌బీ సీఐ), వై.పాండురంగారావు (ట్రాఫిక్ సీఐ), ఎస్.జగదీష్ (సీసీఎస్ సీఐ), ఎస్‌కే రమణారెడ్డి (అడ్మిన్ ఆర్ఐ), బి.మహేంద్ర (ఎస్.కొండ ఎస్సై), రజియాసుల్తానాబేగం (పీజీఆర్ఎస్ సెల్ ఎస్సై), వి.సుధాకర్ (కొత్తపట్నం ఎస్సై), వి.వేమన (పొదిలి ఎస్సై), ఎం.అమిత (ఒంగోలు తాలూకా ఎస్సై), వి.సురేష్‌బాబు (ఒంగోలు ఆర్ఎస్ఐ), బి.అంకరాజు (డీఎస్‌బీ ఎస్సై, ఒంగోలు), ఎస్‌కే మీరా (సీసీఎస్ ఎస్సై, ఒంగోలు), ఎస్‌కే సంధానీబాషా (సూపరింటెండెంట్), వి.తిరుపతిస్వామి (ఏఆర్ ఎస్సై), ఒ.రవికుమార్ (ఆర్ఎస్ఐ, ఒంగోలు), డి.మాల్యాద్రి (స్టేషన్ ఫైర్ ఆఫీసర్), బీఐ నాయక్ (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఏపీసీపీడీసీఎల్), పి.సుబ్బారావు (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కోస్టల్ సెక్యూరిటీ)

ప్రతిభకు పురస్కారం

- ఉత్తమ సేవలందించిన 512 మంది అధికారులు, ఉద్యోగులకు ప్రశంసపత్రాలు
- వారిలో 24 మంది జిల్లా అధికారులు

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ ప్రతిభ కనబరిచిన 512 మంది అధికారులు, ఉద్యోగులు, ఎన్‌జీఓలకు 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రశంసపత్రాలు అందజేశారు. ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎస్పీ ఏఆర్ దామోదర్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఉత్తమ సేవలందించిన వారికి ఈ పురస్కారాలు అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో ప్రధానంగా జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, డీఆర్ఓ బీసీహెచ్ ఓబులేసు, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, బీసీ కార్పొరేషన్ ఈడీ ముప్పూరి వెంకటేశ్వరరావుతో పాటు మొత్తం 24 మంది జిల్లా అధికారులు ఉన్నారు. కలెక్టర్ కార్యాలయం నుంచి 45 మంది, రెవెన్యూ విభాగం వారు 30 మంది, పోలీస్ డిపార్ట్‌మెంట్ వారు 87 మంది, జిల్లా పరిషత్ నుంచి 14 మంది, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌లోని సిబ్బంది 12 మంది, డీఆర్‌డీఏ–వెలుగు నుంచి 13 మంది, డ్వామా నుంచి 10 మంది, వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న వారు 13 మంది, పంచాయతీరాజ్‌లో పనిచేస్తున్న వారు 11 మంది, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వారు 10 మంది, సోషల్ వెల్ఫేర్‌లో పనిచేస్తున్న వారు 22 మందితో పాటు జిల్లాలోని అన్ని విభాగాల్లో ప్రతిభావంతులకు ప్రశంసపత్రాలు అందజేశారు. వీరితో పాటు ఎన్‌జీఓలకు, కల్చరల్ ప్రోగ్రామ్స్, ప్రభుత్వ విభాగాల శకటాలు, స్టాల్స్‌కు కూడా ప్రశంసపత్రాలు అందజేశారు.

సేవకు సన్మానం



టంగుటూరి ప్రకాశం పంతులు ముని మనుమడిని సన్మానిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ, ఎంపీ, ఎమ్మెల్యేలు

ఒంగోలు సబర్బన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వాతంత్య్ర సమరయోధుల సేవలను గుర్తుచేసుకుంటూ వారి వారసులను ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మూడు కుటుంబాలకు చెందిన వారిని పూలమాలలు, దుశ్శాలువాలతో కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్, తదితరులు సత్కరించారు. సత్కారం పొందిన వారిలో స్వాతంత్య్ర సమరయోధులు, ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు ముని మనుమడు సంతోష్ కుమార్, కరవది వెంకటేశ్వర్లు కుమార్తె, అల్లుడు సుబ్బలక్ష్మి దంపతులు, పర్వతం వెంకటేశ్వర్లు కుమారుడు రాంప్రసాద్ ఉన్నారు.

జూదరుల అరెస్ట్.. రూ.50,750 స్వాధీనం

యర్రగొండపాలెం: త్రిపురాంతకం మండలంలోని ల్లేళ్లపల్లి సమీపంలోని కొండల్లో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.50,750 నగదు స్వాధీనం చేసుకున్నారు.



పట్టుకున్న జూదరులతో పోలీసులు



కలెక్టరేట్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న జేసీ గోపాలకృష్ణ



పీడీసీసీ బ్యాంకులో మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న జేసీ, బ్యాంకు అధికారులు



ఎస్పీ కార్యాలయ సిబ్బందికి స్వీట్లు పంచుతున్న ఎస్పీ దామోదర్

రాజ్యాంగ స్ఫూర్తితో జిల్లా అభివృద్ధి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ
- కలెక్టరేట్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవం

ఒంగోలు అర్బన్: రాజ్యాంగ స్ఫూర్తితో జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేశారు. తొలుత పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్య్రం కోసం అశువులు బాసిన ఎంతో మంది మహనీయుల త్యాగఫలాలను నేడు మనం అనుభవిస్తున్నామని, వారి స్ఫూర్తితో ప్రతిఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి జాయింట్ కలెక్టర్ స్వయంగా మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఓబులేసు, డీపీఓ వెంకటనాయుడు, డీఎస్ఓ పద్మశ్రీ, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా, కలెక్టరేట్ ఉద్యోగులు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో...

ఒంగోలులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం హైదరీ క్లబ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దేశం మనకి ఏమిచ్చిందనేకంటే దేశానికి మనం ఏమిచ్చామనే విధంగా పౌరులు ఎదగాలన్నారు. కలెక్టర్ సీసీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి, తదితరులు

పీడీసీసీ బ్యాంకు కేంద్ర కార్యాలయంలో...

ఒంగోలు సబర్బన్: భారత రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరూ గౌరవించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక పీడీసీసీ బ్యాంకు కేంద్ర కార్యాలయంలో 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి జేసీ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు దేశానికి చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో పీడీసీసీబీ జీఎం కే రాఘవయ్య, డీజీఎం వై.ప్రకాష్, ఏజీఎంలు ఎం.శైలజ, కే.వీరనారాయణ, ఎం.బాలకుమారి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థలో...

ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థలో వైస్ చైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ జాతీయ జెండా ఎగురవేశారు. సెక్రటరీ ఈ.వెంకటరెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ కే బాబూరావు, జేపీఓ కే శారద, ఎస్‌కే రహంతుల్లా, వై.అంకయ్య, ఏఓ టి.రాంభూపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

జిల్లా పోలీస్ కార్యాలయంలో 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎస్పీ ఏఆర్ దామోదర్ జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడు గౌరవించాలని, ముఖ్యంగా పోలీసు సిబ్బంది నిబద్ధతతో, నిష్పక్షపాతంగా ప్రజల హక్కులను కాపాడుతూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పోలీస్ సిబ్బంది సమిష్టిగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. అనంతరం సిబ్బంది అందరికీ ఎస్పీ మిఠాయిలు పంచిపెట్టారు. విధి నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సురేష్‌బాబు, డీపీఓ ఏఓ రామ్‌మోహన్‌రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా న్యాయస్థానం ఆవరణలో...

ఒంగోలు: జాతీయ నాయకుల స్ఫూర్తితో ముందుకు సాగుదామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక జిల్లా న్యాయస్థానం ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలను ప్రతి ఒక్క పౌరుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు డి.అమ్మన్నరాజా, టి.రాజావెంకటాద్రి, డి.రాములు, పి.లలిత, సీనియర్ సివిల్ న్యాయవాదులు జి.దీన, ఎస్.హేమలత, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి మోహన్‌దాస్, కార్యదర్శి సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఒంగోలు బార్ అసోసియేషన్ లైబ్రరీ వద్ద కూడా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

నూతన పరిశ్రమల ద్వారానే యువతకు ఉపాధి



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి ఈశ్వరయ్య

- ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి ఈశ్వరయ్య

ఒంగోలు సిటీ: దేశవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పరిష్కారం కావాలంటే నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి జి.ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య 16వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ అరుణ పతాకాన్ని జిల్లా మాజీ కార్యదర్శి వెంకటరావు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు కరుణానిధి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ అమలు చేయకపోవడంతో పాటు విదేశాలలో దాగి ఉన్న నల్లధనాన్ని తీసుకొస్తా అని చెప్పిన హామీలను గాలికొదిలేశారన్నారు. కార్పొరేట్లకు దాసోహంగా మోదీ ప్రభుత్వం గులాంగిరి చేస్తోందని ఆరోపించారు. యువతకు ఉపాధి చూపించకుండా దేశంలో మత రాజకీయాలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, సామాజిక అంతరాలు, ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడంలో బీజేపీ ప్రభుత్వం మునిగితేలుతోందని ఆరోపించారు. దీనిని ప్రజలు గమనించాలని కోరారు. జిల్లా అభివృద్ధి కోసం యువత ఉద్యమించాలన్నారు. ఉద్యోగాలు ఇవ్వకుంటే నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ చేయాలన్నారు. మహాసభలో జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి శ్రీరామ్‌శ్రీనివాసులు, జిల్లా నాయకులు సుబ్బారావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామంజి, పవన్‌కళ్యాణ్, స్వర్ణ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో చోరీ



దొంగలు తెరిచిన బీరువా

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పాండురంగారెడ్డినగర్‌లో చోరీ జరిగింది. ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాల్లోకెళ్తే.. రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి మల్లికార్జునస్వామి తన భార్యకు అనారోగ్యంగా ఉండటంతో చికిత్స కోసం రెండు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు.. ఆ తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఎల్ఈడీ టీవీ, రెండు వెండి చెంబులు, రూ.5 వేల నగదు అపహరించుకుని వెళ్లారు. ఆ మేరకు ఆదివారం హైదరాబాద్ నుంచి వచ్చిన మల్లికార్జునస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రాజులకాలనీలో ఐదు సవర్ల బంగారం, రూ.30 వేల నగదు అపహరణ...

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ రాజులకాలనీలో జరిగిన చోరీ ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై బి.మహేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. రాజులకాలనీలో నివాసం ఉంటున్న విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి జంపన ఆంజనేయరాజు దంపతులు 10 రోజుల క్రితం సంక్రాంతి పండక్కి వచ్చిన కూతురు, అల్లుడితో కలిసి చెన్నై వెళ్లారు. శనివారం రాత్రి తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటి తాళం తీసి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా, బీరువా తెరిచి ఉంది. అందులోని వస్తువులు మంచంపై చిందరవందరగా పడేసి ఉన్నాయి. 5 సవర్ల బంగారం, 30 వేల రూపాయల నగదు చోరీ అయినట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. ఎస్సై బి.మహేంద్ర చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రాజులకాలనీలో చోరీ జరిగిన గృహంలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం